

నాగన్నా.. కరుణించు

● ఘనంగా నాగుల చవితి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని జిల్లావాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మంగళవారం ఉదయాన్నే కుటుంబ సభ్యులంతా సమీప తోటల్లో పుట్టల వద్దకు చేరుకుని.. పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి.. నాగన్నా.. కరుణించు అని వేడుకున్నారు. శ్రీకాకుళంలోని గణేష్ నగర్, ఇలిసిపురం జంక్షన్, రైతుబజార్, మహాలక్ష్మి నగర్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, పోస్టాఫీస్ సమీపంలో ఉన్న పుట్టల వద్ద అధిక సంఖ్యలో భక్తులు కనిపించారు.



శ్రీకాకుళంలోని ఇలిసిపురం వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు




శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలో పుట్ట వద్ద..

పల్లెల్లో రోడ్ల పండగ

● చురుగ్గా రహదారులు, కాలువల నిర్మాణాలు
● ఐదేళ్ల తర్వాత బాగుపడుతున్న మౌలిక వసతులు
● ప్రజల్లో హర్షాతిరేకాలు

● రణస్థలం పంచాయతీ ఎస్సీకాలనీ, పిట్టపాలెం, నక్కలపేట రహదారులు దారుణంగా ఉండేవి. 'పల్లెపండగ'లో భాగంగా ప్రస్తుతం ఇక్కడ రూ.45లక్షలతో సీసీ రహదారులతో పాటు కాలువలు నిర్మిస్తున్నారు. దీంతో దశాబ్దాల సమస్యకు పరిష్కారం దొరికిందని స్థానికులు ఆనందపడుతున్నారు.

● పైడిభీమవరం పంచాయతీ పరిధిలో సరగడపేటకు సరైన రోడ్డు సదుపాయం లేదు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. గత ఐదేళ్లలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా ఫలితం లేకపోయింది. ఇటీవల కూటమి ప్రభుత్వం గ్రామసభ ఏర్పాటు చేయగా.. రహదారి బాగుచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.25 లక్షల నిధులు మంజూరు చేయగా.. పనులు ప్రారంభమయ్యాయి.



వజ్రపుకొత్తూరు మండలం సందిపల్లిలో రహదారి పనులు

శ్రీకాకుళం/ రణస్థలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో 'పల్లె పండగ' పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం.. గత ఐదేళ్ల గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదు. రహదారులు, కాలువలకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు (మిగతా 4వ పేజీలో..)

జిల్లాలో చేపడుతున్న పనుల వివరాలు...

నియోజకవర్గం	రోడ్లు	నిధులు (రూ.లక్షల్లో)	కాలువలు	నిధులు (రూ.లక్షల్లో)
శ్రీకాకుళం	292	1,573.45	158	1,680.60
ఆమదాలవలస	316	3,244.39	79	755.50
ఎచ్చెర్ల	375	2,093.00	--	--
నరసన్నపేట	38	1,933.00	47	452.00
టెక్కలి	840	6,539.11	17	17
ఇచ్ఛాపురం	625	2,942.39	--	--
పలాస	423	3,412.40	36	433.89
పాతపట్నం	394	2,121.98	100	449.38
మొత్తం	3,303	23,859.72	437	3,788.37

'బెల్టు' తీస్తాం

● జొన్నలపాడు ఘటనపై ఎక్సైజ్ అధికారుల విచారణ
● మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలకు నిర్వహించిన వేలం ఘటనపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. గార మండలం జొన్నలపాడులో ఇటీవల బెల్టు దుకాణాలకు వేలంపాట నిర్వహించిన సభలో పాల్గొన్న వైసీపీ నాయకులు, గ్రామ పెద్దలతో మంగళవారం ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ సమావేశమయ్యారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాల్సిన గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఇటువంటి కార్యక్రమాలకు ప్రోత్సహించడంపై మండిపడ్డారు. బెల్టుషాపులు నిర్వహించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓ వైపు గ్రామంలో సమావేశం నిర్వహిస్తూనే మరోవైపు తన బృందంతో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దుమని నీలయ్య వద్ద 180ఎంఎల్ సీసాలు ఏడు లభించాయి. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తే బాధ్యత వహిస్తామంటూ గ్రామ పెద్దలు, వైసీపీ ప్రజాప్రతినిధులతో పూచీకత్తు రాయించారు. పాత నేరస్తులపై నిఘా పెట్టామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐతోపాటు ఎస్సైలు ఆర్.మహేష్, బి.రాజేష్ పాల్గొన్నారు.



జొన్నలపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

నీటి సంఘాల ఓటరు జాబితా సిద్ధం చేయండి

● కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నీటి యాజమాన్య సంఘాల ఓటరు జాబితాను ఈ నెల 9వతేదీ నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో శాఖల (మిగతా 4వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన డీఆర్వో

అమ్మా.. క్షమించు

● తల్లి చివరిచూపునకు నోచుకోని కొడుకు
● బెంగళూరు నుంచి వచ్చేందుకు డబ్బుల్లేక..
● భార్యతో అంత్యక్రియలు పూర్తి

సోంపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కొడుకు. తల్లి చనిపోతే చివరి చూపునకు నోచుకోలేక పోయాడు. చేతిలో డబ్బుల్లేక రాలేకపోయాడు. దీంతో తన భార్యతో అంత్యక్రియలు పూర్తి చేయించాడు. కవిటి కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన యజ్జల గోపమ్మ(70) నిరుపేద. ఆస్తిపాస్తులు లేవు. దినసరి కూలీగా పనిచేస్తోంది. ఈమెకు కొడుకు ప్రసాద్. ఒక కూతురు ఉంది. ఇక్కడ పనుల్లేక పదేళ్ల క్రితం ప్రసాద్ కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ కోతమిల్లు పనిలో దినసరి కూలీగా చేరాడు. ఇతనికి ఎనిమిది సంవత్సరాల క్రితం జింకిభద్రకి చెందిన తులసమ్మతో వివాహమైంది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. బెంగళూరులో ఖర్చులు భరించలేక వీరిని తీసుకెళ్లలేదు. జింకిభద్రలోనే ఆ ముగ్గురిని తల్లి వద్ద ఉంచాడు. గోపమ్మ కూతురుకు ఏడాది క్రితం వివాహమైంది. గోపమ్మ కోడలు, మనవడు, మనవరాలితో కలిసి కొద్దిరోజులు బెజ్జిపుట్టగలో జీవనం సాగించారు. తులసమ్మ తల్లి జింకిభద్రలో ఒంటరిగా ఉండటంతో.. తులసమ్మ తన అత్త, పిల్లలను అక్కడికి తీసుకుని వెళ్లింది. అక్కడే అందరూ నివాసం ఉంటున్నారు. ప్రసాద్ పండగలకు జింకిభద్ర వచ్చి తల్లి, భార్యతో గడిపి వెళ్తూ ఉండేవాడు. అయితే మంగళవారం గోపమ్మ మృతి చెందింది. ఆర్థిక కష్టాల కారణంగా ప్రసాద్‌కు వచ్చే అవకాశం లేకపోయింది. దీంతో దుఃఖం దిగమింగుకుని తన భార్యతో అంత్యక్రియలు పూర్తి చేయించాడు. కోడలు తులసమ్మ.. తన అత్తకు దహన సంస్కారాలు నిర్వహించింది.



అత్తకు దహన సంస్కారాలు చేస్తున్న తులసమ్మ

సార్లూ.. ఇది తగునా?



ఆర్ అండ్ బీ బంగ్లా ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పైపులు..

● పలాస మున్సిపాలిటీలో తాగునీటికి అధికారులే విఘాతం
● రూ.95కోట్ల పథకానికి గ్రహణం పట్టించిన వైనం
● ఆర్అండ్‌బీ బంగ్లాలో నిరుపయోగంగా మంచినీటి పైపులు
● రెండేళ్లుగా జాడలేని పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు
● ఏటా రూ.30 లక్షలు అప్పనంగా వారికి వేతనాలు
● చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
● సమీక్షలతోనే సరిపెడుతున్న ప్రజాప్రతినిధులు

పలాస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

● రెండు నెలల క్రితం మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో తాగునీటికి అధిక ప్రాధాన్యమిచ్చి జల జీవన్‌మిషన్ ద్వారా అమలవుతున్న పథకానికి అనుసంధానం చేయాలని ఆదేశించారు.

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వారం క్రితం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు, కమిషనర్‌తో సమీక్ష నిర్వహించి పట్టణ ప్రజలకు తాగునీటిని తక్షణం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● ఈ రెండు సమీక్షలు నిర్వహించిన తర్వాత సీఎం నారా చంద్రబాబునాయుడు.. దీపం పథకం ప్రారంభోత్సవానికి ఇచ్ఛాపురం వచ్చినప్పుడు ఎమ్మెల్యే శిరీష పలాస- కాశీబుగ్గ మంచినీటి పథకం ఇవ్వాలని అభ్యర్థించారు.

అసలేం జరిగిందంటే..

ఈ మూడు కార్యక్రమాల్లో సంబంధిత పబ్లిక్‌వర్క్ డిపార్టుమెంట్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొనకపోవడం.. కనీసం స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనిపై లోతుగా పరిశీలిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. మూడేళ్ల క్రితమే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి మంచినీటి పథకం మంజూరయింది. ఇందుకుగాను రూ.95 కోట్ల అంచనాతో మొత్తం 31 వార్డుల్లో పైపులైన్లు వేసి ప్రాధాన్య క్రమంలో సమగ్రమంచినీటి పథకానికి అనుసంధానం చేసి నీరు ఇవ్వాలని లేదా ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తయితే దానికి కలుపుతూ నీరు ఇవ్వాలని అప్పటి మున్సిపల్ పీడబ్ల్యూడీ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు వేసి తక్షణం అమల్లోకి తెచ్చారు. ఇందుకోసం భారీగా పైపులు వివిధ కంపెనీల నుంచి తెప్పించి కాశీబుగ్గ ఆర్అండ్‌బీ బంగ్లాలోని ఖాళీ ప్రదేశంలో నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో కేటీ రోడ్డు విస్తరణ పనులు జరగడం.. 80 అడుగుల రహదారి వేయడంతో పైపులైన్లు రెండు కిలోమీటర్ల వరకు వేశారు. అనంతరం ఎన్నికలు వచ్చి కూటమి అధికారంలోకి వచ్చింది. తర్వాత ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. అయితే వీటిని కొనసాగించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అడ్రస్ లేకపోవడంతో పనులన్నీ ప్రస్తుతం ఆగిపోయినట్లే అనిపిస్తోంది. కొత్తగా జలజీవన్‌మిషన్ ద్వారా నిర్వహిస్తున్న సమగ్ర మంచినీటి పథకం పూర్తయి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు నీరు అందుతున్నా.. పైపులైన్లు పూర్తికాకపోవడంతో ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. మున్సిపల్ మంచినీటి పథకం పైపులైన్ల నిర్మాణం సకాలంలో పూర్తయింటే నీటి ఇబ్బందులు ఉండేవి కావు. ప్రస్తుతం చాలా వార్డుల్లో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రెండేళ్లుగా కనిపించలేదు..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పబ్లిక్‌వర్క్స్ డిపార్టుమెంట్ డీఈఈ, ఏఈఈలు రెండేళ్లుగా కనిపించకుండా పోయారు. పనిచేయకున్నా వేతనాలు నేరుగా మున్సిపల్ ఖాతాల నుంచి వారి అకౌంట్‌ల్లో జమ అవుతున్నాయి. వీరికి మున్సిపల్ కార్యాలయం వెనుకభాగంలో మోక్షగుండం విశ్వేశ్వరావు భవనంలో ఓ గది ఉన్నా వారు కనిపించకపోయేసరికి దాన్ని మెప్మా కార్యాలయానికి ఇచ్చారు.



ఇంజనీరింగ్ అధికారులు రాకపోవడంతో మెప్మా విభాగానికి అప్పగించిన పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ భవనం..

నిరుపయోగంగా మంచినీటి పైపులు..


ఒక్కో పైపు సైజును బట్టి రూ.7వేల నుంచి రూ.10వేల వరకూ ఉంటుంది. అతికష్టంపై వాటిని రెండేళ్ల క్రితం తీసుకువచ్చి ఆర్ అండ్ బీ బంగ్లా ఆవరణలో పెట్టారు. వీటికి రక్షణ లేకపోవడంతో ఇప్పటికే కొన్ని చోరీకి గురికాగా మిగిలినవి మక్కిపోతున్నాయి. వీటిని ప్రస్తుతం భూమిలో పాతిపెట్టి వేరే పైపునకు కలపాలన్నా విరిగిపోతాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. రూ.కోట్ల విలువైన పైపులు నిరుపయోగంగా పడేసి కనీసం కాపలాదారులనైనా పెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రజాప్రతినిధులు ఎన్ని సమీక్షలు నిర్వహించి అధికారులను మేలుకొలుపుతున్నా వారు మొద్దు నిద్ర కారణంగా రూ.95 కోట్ల విలువైన మున్సిపల్ మంచినీటి పథకం దాదాపు మూలనపడింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు మంచినీటి పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైఅధికారులకు తెలియజేస్తాం

ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావును వివరణ కోరగా పబ్లిక్‌వర్క్స్ డిపార్టుమెంట్ ఇంజనీరింగ్ అధికారులు మున్సిపల్ కార్యాలయానికి రావడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ పథకం పూర్తయి ఉంటే జలజీవన్ మిషన్ పథకానికి అనుసంధానం జరిగి ఉండేదని, కారణాలు ఏవైనా పనులు ఆగిపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేస్తామన్నారు.

అవి సజీవ చిత్రాలు

● ఆయన చేతి నుంచి అద్భుతమైన కళాఖండాలు ● ప్రపంచస్థాయి గుర్తింపు.. ఎన్నో అవార్డులు ● ఎందరినో ప్రోత్సహించిన మాస్టార్ మోహన్‌రావు



చిత్రాలు వేస్తున్న డ్రాయింగ్ మాస్టార్ మోహనరావు



మోహనరావు గీచిన చిత్రాలు

నరసన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

ఆయన నుంచి ఎన్నో ఎన్నో అద్భుతమైన కళాఖండాలు జాలువారాయి. అవి సజీవచిత్రాలుగా నిలిచాయి. అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాయి. ఆయనకు ఎన్నో అవార్డులు, సన్మానాలను తెచ్చిపెట్టాయి. తండ్రి వద్ద తాను నేర్చుకున్న చిత్రకళను పదిమందికి నేర్పించారు. అలా.. ఆయనకు వందలాది మంది శిష్యులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తూనే అందమైన చిత్రాలను గీశారు. ఆయన పేరు మెండ మోహనరావు. ఆయన స్వగ్రామం పోలాకి మండలం దీర్ఘాశి. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్. చిన్నతనంలో తండ్రి మెండ అచ్చెయ్య వద్ద నేర్చుకున్న చిత్రకళ.. తల్లి గంగమ్మ నేర్పిన క్రమశిక్షణతో.. నరసన్నపేట, పోలాకి, పిరియాగ్రహారం, శ్రీకాకుళం, పాతపట్నం పాఠశాలల్లో పనిచేస్తూనే ఎందరో శిష్యులకు నేర్పించారు. విద్యార్థులు గీచిన చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు సాధించాయి. కొందరు శిష్యులు ప్రస్తుతం చిత్రకళలో ప్రావీణ్యం సాధించి కార్పొరేట్, పాఠశాలల్లో, చిత్రపరిశ్రమలో కూడా పనిచేస్తున్నారు.

ఎన్నో కళాఖండాలు..

మోహనరావు చేతి నుంచి అద్భుత కళాఖండాలు జాలువారాయి. సామాజిక పరిస్థితులను వివరించేలా ఉంటాయి. అనాటి భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన లియోనార్డ్ డావిన్సి గీచిన మోనాలిసా చిత్రం ప్రశంసలు పొందింది. రాధాకృష్ణులు, ముగ్ధమనోహరం, త్యాగరాజు తదితర చిత్రాలు ఎంతో ఆదరణ పొందాయి. వర్తమాన అంశాలను మేళవిస్తూ మోహనరావు గీచిన చిత్రాలు జాతీయ స్థాయిలో కూడా అవార్డులు పొందాయి.

ఎన్నో అవార్డులు..

మోహనరావు తన సృజనాత్మకతో ఏటా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో బహుమతులును కొల్లగొడుతున్నారు.

● 2001 నుంచి పలు స్వచ్ఛంద సంస్థల నుంచి బహుమతులు పొందారు. 2002లో జాతీయస్థాయిలో గోరా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రపంచ నాస్తిక మహాసభల్లో ఎయిడ్స్‌పై గీచిన చిత్రాలను మెచ్చుకొని నార్వే దేశానికి చెందిన ప్రాగీ చేతులు మీదుగా సన్మానం పొందారు.

● 2003లో అప్పటి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు ఎర్రంనాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇలా ప్రతీ ఏటా కోనసీమ కళాపరిషత్ నుంచి, 2008లో డాక్టర్ సమరం నుంచి కూడా అవార్డులు కైవసం చేసుకున్నారు.

● ఈఏడాది ఫిబ్రవరిలో విజయవాడ - డ్రీమ్ ఆర్ట్ అకాడమీ జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో మోహనరావు చిత్రాలు సందర్శకులకు ముగ్ధులను చేశాయి. పలు సంస్థలు ఆయనను సన్మానించాయి.

చిత్రకళాకు ప్రాధాన్యం పెరగాలి..

ప్రస్తుతం ఏనిమేషన్ రంగానికి ఆదరణ పెరిగడంతో చిత్రకళ్ళపై మక్కువ ఉన్నవారు అటువైపు వైపు పరుగులు పెడుతున్నారు. అయితే చిత్రకళ కూడా ఎంతో అవసరం. చారిత్రక ఘటనలకు చిత్రకళలు సజీవ సాక్ష్యాలు. చిత్రకళను పాఠశాలల్లో విద్యార్థులను నేర్పిస్తున్నాను.

రబీకి సిద్ధం

● 90 వేల హెక్టార్లలో పంటలకు రైతులు సన్నద్ధం

● ఏపీ సీడ్స్ ద్వారా సబ్సిడీ విత్తనాలు



వ్యవసాయశాఖ అధికారులు రైతాంగానికి అందిస్తున్న వేరుశనగ విత్తనాలు



టెక్కలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ పంటలు సుమారు 90వేల హెక్టార్లలో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, చెరుకు, వేరుశనగ, పెసలు, మినుములు, కట్టెజనుము, రాగులు, నువ్వులు, పొద్దుతిరుగుడు రకాలను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది నదీ పరీవాహక ప్రాంతాలు, వాగులు, గెడ్డలు, చెరువుల్లో నీటి సౌకర్యం ఉండడంతో రైతాంగం రబీ సీజన్‌పైనే మక్కువ చూపుతోంది. జిల్లాలో రబీ పంటలు పండించేందుకు 79,397 హెక్టార్లు ఉండగా, గత ఏడాది సుమారు 54వేల హెక్టార్లలో సాగుచేశారు. ఈసారి మరింత అనుకూలమైన వాతావరణం ఉండడంతో 90వేల హెక్టార్ల వరకు సాగుచేసే పరిస్థితులు ఉన్నాయి. వరి సుమారు పదివేల హెక్టార్లు, జొన్న 18వేల హెక్టార్లు, రాగులు 2,500 హెక్టార్లు, పెసలు 18వేల హెక్టార్లు, మినుములు 30వేల హెక్టార్లు, వేరుశనగ ఐదువేల హెక్టార్లు, పొద్దుతిరుగుడు 220 హెక్టార్లు, చెరుకు 1,102 హెక్టార్లు, కట్టెజనుము 1,300 హెక్టార్లు, నువ్వులు ఐదువేల హెక్టార్లలో రైతులు సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయశాఖ ఇండెంట్ మేరకు ఏపీ సీడ్స్ 50 నుంచి 70శాతం విత్తనాలు సరఫరా చేసేందుకు సన్నద్ధమవుతుండగా, మిగిలిన విత్తనాలను విత్తన డీలర్లు అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఏపీ సీడ్స్ ద్వారా వేరుశనగ కే6 రకం రైతాంగానికి అందించేందుకు వ్యవసాయాధికారులు చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా 4,518 క్వింటాళ్లు వేరుశనగ వ్యవసాయశాఖ అందిస్తోంది. అలాగే పెసలు ఐపీఎం205-7 రకం, విరాట్ రకం రూ.150 క్వింటాళ్లు, మినుములు వీబీఎన్-8, ప్రియ-31 రకం 200 క్వింటాళ్లు, రాగులు ఇంద్రావతి, వేగావతి రకం 80 క్వింటాళ్లు, నువ్వులు వైఎల్ఎం-66, టిల్1 రకం 70 క్వింటాళ్లు, కట్టెజనుము 200 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు ఏపీ సీడ్స్ సిద్ధం చేసింది. ఆయా రైతు సేవా కేంద్రాల్లో గ్రామీణ వ్యవసాయ సహాయకులు డి-కృషి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసి రైతులకు విత్తనాలు అందిస్తున్నారు. ఇక రబీలో పండించే వరి విత్తనాలు మాత్రం ప్రైవేట్ డీలర్లే అమ్మకాలు చేస్తున్నారు. అయితే వాతావరణం ఏమేరకు అనుకూలించి రైతులకు కలిసొస్తుందో వేచిచూడాలి.

పల్లెల్లో రోడ్ల పండగ



● లావేరు మండలం బుడత వలసలో సీసీ రహదారులతో పాటు కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు గత కొన్నేళ్లుగా కోరుతూ వచ్చారు. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే కూటమి ప్రభుత్వం గ్రామసభను ఏర్పాటు చేసి ప్రాధాన్యతా పనులను గుర్తించింది. రూ.24 లక్షలు మంజూరు కావడంతో వాటి పనులు ప్రారంభమయ్యాయి.

(మూడో పేజీ తరువాయి)

నరకయాతన పడ్డారు. సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు వంటి వాటి నిర్మాణం మాత్రమే చేపట్టింది. వాటికి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులకల్పన విషయంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కేవలం సంక్షేమ పథకాల పేరు చెప్పి కాలయాపన చేసింది. రోడ్లు దారుణంగా తయారయ్యాయి. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన కాలువలు ధ్వంసమయ్యాయి. పారిశుధ్యం దారుణంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'పల్లె పండగ' పేరిట గ్రామాల్లో గత నెల 14 నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రస్తుతం అన్నిచోట్లా రహదారులు, కాలువల పనులు జరుగుతుండడంతో.. గ్రామాలకు మహర్దశ వచ్చిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● రూ.276.53 కోట్లతో పనులు..

జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ, డ్వామా, గ్రామీణ నీటిసరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యుఎస్) ఆధ్వర్యంలో రూ.276.53 కోట్ల వ్యయంతో పనులు ఆరంభమయ్యాయి. ఎనిమిది నియోజకవర్గాల్లో 3,740 పనులు చేపడుతున్నారు. రహదారులు, కాలువలు నిర్మిస్తున్నారు. 30 మండలాల్లో 3,303 రోడ్ల నిర్మాణానికి రూ.238.59కోట్లు ఖర్చు చేస్తున్నారు. గరిష్ఠంగా ఒక్కో మండలంలో 50 నుంచి 200 వరకు రోడ్లు నిర్మిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న 437 కాలువల పనులకు రూ.37.41కోట్లు కేటాయించారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా.. పనులు చురుగ్గా జరిగేందుకు ప్రతివారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. అదేరీతిన అన్ని మండలాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. మరో ఆరు నెలల్లో రోడ్ల పనులు పూర్తికానున్నాయి.



● వేల్పులరాయిలో చాలా వీధుల్లో సీసీ రహదారుల నిర్మాణం జరగలేదు. గతంలో నిర్మించినవి సైతం శిథిలమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం.. గ్రామసభలో ఈ పనులను గుర్తించి.. రూ.25 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు చేపడుతున్నారు.

శుభ పరిణామం..



వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనుల జాడలేకుండా పోయింది. కనీసం పిడికెడు మట్టితీసి సిమెంట్ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు రావడం శుభ పరిణామం.

-డి.వసంతరావు, జేఆర్.పురం

పల్లెలు బాగుపడుతున్నాయి..



వైసీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి కనుమరుగైంది. పంచాయతీల సొమ్మును సైతం దారి మళ్లించారు. ఆర్థిక సంఘం నిధులను సైతం వివిధ పద్దుల కింద జమ చేసుకున్నారు. ఇవన్నీ అభివృద్ధిపై ప్రతాపం చూపాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టడంతో పల్లెలు బాగు పడుతున్నాయి.

-వెలిచేటి చిన్నమౌళి, దేవరాపల్లి, రణస్థలం

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జిల్లాలో అన్ని గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు ప్రారంభించాం. ప్రతిరోజు మండలాల వారీగా చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. పల్లెప్రాంతాల్లో శతశాతం రోడ్లు నిర్మాణాలు పూర్తవుతాయి. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి.

-బి.సుధాకరరావు, డ్వామా పీడీ

ఆర్టీసీపై ప్రైవేటు దెబ్బ

● అధిక ఆదాయ మార్గాల్లో ప్రైవేటు బస్సుల హవా

● ఆపరేటర్ల దందాతో తీవ్ర నష్టం

● చోద్యం చూస్తున్న నాయకులు, అధికారులు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

అరసవల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీకి ప్రైవేటు బస్సుల రూపంలో నష్టం వాటిల్లుతోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీకి ప్రగతి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. ప్రైవేటు ఆపరేటర్ల అనధికార దందా కారణంగా.. ఆర్టీసీకి చాలా రూట్లలో ఆక్యుపెన్సీ రేటు లేక.. ఆశించిన స్థాయిలో ఆదాయం దక్కడం లేదు. జిల్లాలో శ్రీకాకుళం-1, -2, టెక్కలి, పలాస డిపోలు ఉన్నాయి. శ్రీకాకుళంలో రెండు డిపోల నుంచి 182 బస్సులు, టెక్కలి నుంచి 56 బస్సులు, పలాస డిపో నుంచి 72 బస్సులు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. ఈ బస్సులన్నీ రోజుకు 1.22 లక్షల కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుండగా.. సుమారు రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. జిల్లా నుంచి అత్యధికంగా విశాఖపట్నానికి 56 బస్సులు సర్వీసులు అందిస్తున్నాయి. ఈ రూటులోనే అత్యధిక ఆదాయం లభిస్తోంది. నిజానికి సంస్థ లాభాల బాటలో ప్రయాణించాలంటే 95 శాతం ఆక్యుపెన్సీ రేటు ఉండాలి. కానీ చాలాచోట్ల అత్యధిక ఆక్యుపెన్సీ రేటు 70శాతానికి మించి ఉండడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకు గత 4 నెలల్లో 21 కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో మరిన్ని బస్సులు కూడా అందుబాటులోకి వస్తే జిల్లాలో పరిస్థితి మెరుగవుతుందని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు.

● ప్రైవేటు ఆపరేటర్ల దందా..

జిల్లాలో అత్యధిక ఆదాయం ఉన్న శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం రూట్‌లో ప్రైవేటు ఆపరేటర్లు అత్యధికంగా సుమారు 29 బస్సులు నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి వీరు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు క్యారేజ్ అనుమతి మాత్రమే తీసుకుంటారు. కానీ ప్రతీ స్టేజ్‌లో ఆపుతూ స్టేజ్ క్యారేజ్ పద్ధతిలో బస్సులు నడుపుతున్నారు. దీంతో అటు ప్రభుత్వానికి, ఇటు సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రైవేటు ఆపరేటర్లు ఆర్టీసీ కాంప్లెక్సుకు 2కి.మీ. దూరంలో తమ బస్సులను ఆపాలి. కానీ ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ గేటు ఎదురుగానే వీరు తమ బస్సులను ఆపుతున్నారు. కాంప్లెక్స్‌లోకి వచ్చి మరీ ప్రయాణికులను వారి బస్సుల్లోకి తీసుకుపోతున్నారు. ఆర్టీసీ అధికారులు వారిని ప్రశ్నిస్తే.. అడిగేందుకు మీరెవరనే సమాధానం ప్రైవేటు ఆపరేటర్ల నుంచి ఎదురవుతోంది. డీటీఓ అడిగితే.. తాము చూసుకుంటాములే అని వారు చెప్పడంతో ఆర్టీసీ సిబ్బంది, అధికారులు మౌనంగా ఉంటున్నారు. పలుమార్లు ఈ విషయాన్ని నాయకుల దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ప్రైవేటు బస్సుల దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఆర్టీసీ మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ గేటు ఎదురుగా ప్రైవేటు బస్సులు

నష్టాలు తగ్గాలంటే..

ముఖ్యంగా తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న ఆమదాలవలస, చీపురుపల్లి, మబగాం, శ్రీముఖలింగం, బైరిపురం, మంచినీళ్లపేట వంటి రూట్లలో ఆక్యుపెన్సీ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలి. ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా అధిక ఆదాయం లభిస్తోంది. జిల్లాలో మొత్తం నడుస్తున్న 310 బస్సుల్లో 94 బస్సులు అద్దె ప్రాతిపదికన సేవలు అందిస్తున్నాయి. ఈ సర్వీసుల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్ల జీతభత్యాలు, ఆయిల్, మెయింటెనెన్స్ చార్జీల భారం ఆపరేటర్లే భరిస్తారు. కనుక మరిన్ని అద్దె బస్సులను సంస్థలో నడపడం ద్వారా మెరుగైన ఆర్థిక ప్రగతిని సాధించడం సాధ్యపడుతుంది. దూరప్రాంత సర్వీసులకు సంబంధించి విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు స్లీపర్, ఏసీ స్లీపర్ బస్సులను నడపడం ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. నిత్యం ప్రైవేటు ఆపరేటర్లు 90 శాతం పైగా ఆక్యుపెన్సీతో ఈ రూట్లలో బస్సులు నడుపుతూ అధిక స్థాయిలో లాభాలను గడిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అధికారులు దీనిపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మెరుగైన సేవలందిస్తాం..



జిల్లాలో ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. పండగ వేళలు, ప్రత్యేక సందర్భాల్లో అదనపు బస్సులను నడుపుతున్నాం. మెరుగైన ఫలితాలు సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహిస్తున్నాం. ప్రైవేటు ఆపరేటర్ల బెడద అధికంగా ఉంది. ఈ విషయాన్ని అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఆ ఇబ్బంది నుంచి బయటపడతాం. అలాగే దూరప్రాంత సర్వీసుల్లోకి ఏసీ స్లీపర్, స్లీపర్ బస్సులను ప్రవేశ పెట్టడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ముందడుగు వేస్తాం. 15ఏళ్లు పైబడి సర్వీసు అందించిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు వస్తే కచ్చితంగా మంచి ఫలితాలు సాధించవచ్చు.

-ఏ.విజయకుమార్, డీపీటీఓ, శ్రీకాకుళం

నీటి సంఘాల ఓటరు జాబితా సిద్ధం చేయండి

(మూడో పేజీ తరువాయి)

వారీగా ఉన్న కోర్టు కేసులు.. తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఎస్ఈఆర్, ఆర్అండ్‌బీ పరిధిలో కోర్టు కేసుల పెండింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల వేదిక.. 'మీ కోసం'లో వచ్చే అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

● 'జిల్లాలో గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి. లేఔట్లలో తాగునీరు, విద్యుత్తు, రహదారులు వంటి మౌళిక వసతులు కల్పించాలి. జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి' అన్నారు.

● నీటి యాజమాన్య సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎటువంటి అనుమానాలున్నా నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి, తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు గెజిటెడ్ అధికారి అవసరమని, పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. తహశీల్దార్లు ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నారని వివరించారు.

● 'జిల్లాలో అపార్ కార్డుల ప్రక్రియ 60.68శాతం పూర్తయింది. ఈ కార్డులు విద్యార్థులకు చాలా ముఖ్యం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ఎంఈవోలు.. విద్యార్థుల వివరాల నమోదుపై ప్రత్యేక దష్టి సారించాలి. సోంపేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో అపార్ ఐడి కార్డు పనులు మందకొడిగా సాగుతు న్నాయి. శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి ఐడీ కార్డుల ప్రక్రియ వేగవంతం చేయాలి' అని కలెక్టర్ ఆదేశించారు.

● కాలువలు, చెత్త కుప్పలు, గ్రీన్ అంబాసిడర్స్‌పై కలెక్టర్ ఆరా తీశారు. ఉద్యాన, ఆయిల్‌పామ్, జీడి, క్రాప్ ఇన్స్యూరెన్స్, ఏపీఈపీడీసీఎల్ పీఎం సూర్యఘర్, డ్వామా పల్లె పండుగ, ఐసీడీఎస్ అంగన్వాడీ, వైద్యారోగ్యశాఖ సీజనల్ వ్యాధులు, ఫీవర్ సర్వేపై సమీక్షించారు. డీఆర్వో వేంకటేశ్వరరావు, డ్వామా పీడీ సుధాకర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఉద్యానవన అధికారి వరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, టెక్కలి, పలాస, శ్రీకాకుళం ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి: ఎస్పీ

పొందూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనల దృష్ట్యా సిబ్బందిని అప్రమత్తం చేసి, నేరాల నియంత్రణపై దృష్టి సారించామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పొందూరు పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహిళల భద్రతకోసం, గంజాయి, డ్రగ్స్ నిరోధానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్, ప్రమాదాల నివారణకు హైవేపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటుచేశామని తెలిపారు. మహిళా పోలీసులకు నేర నియంత్రణపై అవగాహనకోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పొందూరులో క్వారీల్లో పేలుళ్లపై దృష్టి సారించాలని, నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు జరిపితే కేసులు నమోదు చేయాలని ఎస్ఐ సత్యనారాయణను ఆదేశించారు. ఆలయాలు, బంగారం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, పోలీసులకు సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జనవాసాల్లోనే సీసీ రోడ్లు వేయాలి: పీడీ

లావేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగలో భాగంగా చేపడుతున్న సీసీరోడ్డు పనులు జనావాసాల మధ్యనే చేపట్టాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని బుడుమూరు, వెంకటరావుపేట, బుడతవలసల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్డు వీధుల్లో వేస్తే ప్రజలకు ఉపయోగపడేలా ఉంటుందని, కళ్లాలు, పంట పొలాలకు వెళ్లే దారుల్లో సీసీ రోడ్డు వేయరాదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.సత్యవతి, జేఈ లెలిన్‌బాబు, టీఏలు గౌరినాయుడు, వెంకటరమణ, రవి, హైమావతి పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు శ్రీకాకుళం క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మన్యం జిల్లా జోగింపేటలో ఈనెల మూడు నుంచి ఐదోతేదీ తేదీ వరకు 68వ రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు జరిగాయి. ఈపోటీల్లో అండర్-19 బాలికల విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్న పైడి త్రివేణి స్వర్ణ పతకం కైవశం చేసుకోగా, అండర్-14 రికర్ విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరంగి కల్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో వీరిద్దరూ ఈనెల 14 నుంచి గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అర్జున్ ఆర్చరీ అకాడమీ శిక్షకుడు మధుసూదనరావు తెలిపారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పైడి త్రివేణి, ఆరంగి కల్యాణ్

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బిర్లంగి విద్యార్థులు..

ఇచ్ఛాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బిర్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.కవిత అండర్-14, పి.ధర్మరాజు అండర్-17, బి.కార్తీక్ అండర్-19 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు అండర్-14 పోటీలు బుధ, గురువారం అన్నమయ్య జిల్లాలో, అండర్-17, అండర్-19 విభాగాల పోటీలు ఈనెల ఎనిమిది నుంచి పదోతేదీ వరకు ఏలూరు,రాజమండ్రిలో నిర్వహించ నున్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పి.వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యా కమిటీచైర్మన్, గ్రామస్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ధర్మరాజు అభినందించారు.

స్విమ్మింగ్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు..

ఇచ్ఛాపురం కేజీబీవీ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థినులు శైలు, ధనలక్ష్మి, లక్ష్మిశెట్టి, పుష్ప రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల ఏడో తేదీ నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారు. ఈమేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎంతోపాటు క్రీడాకారులు విద్యార్థినులను అభినందించారు.వీరికి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి దక్షత అప్పారావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దాస్ స్విమ్మింగ్ సూట్లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ బి.రామారావు పాల్గొన్నారు.

పరదాలు కట్టి.. సీసాలు ఏర్పాటు చేసి



కంచిలి శివార్లలో పరదాలు కట్టి పంటను రక్షించుకుంటున్న రైతులు

- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు
- సంప్రదాయ పద్ధతులు అనుసరిస్తున్న రైతులు
- అడవి పందుల నుంచి పంట రక్షణకు రైతుల అగచాట్లు



గొల్లకంచిలిలో పంట పొలం చుట్టూ సీసాలు వేలాడ దీసిన దృశ్యం

కంచిలి నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

ఉద్దానంలో దశాబ్దకాలంగా ఖరీఫ్, రబీలో రైతులకు అటవీ పందుల బెడద తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చిన సమయంలో ధ్వంసం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో వీటి నుంచి పంటను రక్షించేందుకు వ్యవసాయ, అటవీ శాఖాధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అడవి పందుల నియంత్రణ అవసరమైన యంత్ర పరికరాలను (సోలార్ ఫెన్సింగ్) ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. చిన్న, సన్నకారు రైతులు సంఘాలుగా ఏర్పాటుచేసి సోలార్ ఫెన్సింగ్ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈనేపథ్యంలో పంటను అడవి పందుల బారి నుంచి సంరక్షించుకునేందుకు రైతులు సంప్రదాయ పద్ధతులపై ఆధారపడుతున్నారు.

కుక్క అరుపులతో మైక్‌సెట్ల ఏర్పాటు..

కంచిలి మండలంలోని గిరిజన ప్రాంతాల్లో రైతులు తమ పంట పొలాల చుట్టూ చీరలు, పరదాలు కట్టి పంటను రక్షించుకుంటున్నారు. కొంతమంది పొలాల గట్ల చుట్టూ చిన్న చిన్న కర్రలు పాతి, వాటికి గాజు సీసాలు వేలాడదీస్తున్నారు. ఇవి గాలికి ఊగుతూ శబ్దాలు చేస్తు అడవి పందులు రాకుండా కాపాడుతున్నాయని రైతులు చెబుతున్నారు. కొంతమంది పొలాల చుట్టూ వలలు వేసుకుని తమ పంటను కాపాడుకుంటున్నారు. సోంపేట మండలంలోని పలు చోట్ల, కవిటి మండలం బీల ప్రాంతాల్లో రైతులు కుక్క అరుపులతో రికార్డు చేసిన మైకు సెట్‌లను అమర్చుతున్నారు. చాలా చోట్ల మాత్రం రైతులే రాత్రివేళల్లో పంటను రక్షించుకునేందుకు పొలాల వద్దే కాపు కాస్తున్నారు.



పలాసపురంలో సిద్ధం చేసి ఉంచిన మైక్ సెట్

తలకు మించిన భారం..

సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే పంటలను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఎకరా పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు లక్ష రూపాయలకు పైబడి ఖర్చవుతుంది. ఇంత మొత్తంలో పెట్టుబడులు పెట్టడం చిన్న, సన్నకారు రైతులకు భారంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం చిన్న రైతులకు అవసరమైన సోలార్ ఫెన్సింగ్ సబ్సిడీపై అందించాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో ఈ ఏడాది 42 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ప్రధానంగా సోంపేట మండలంలోని పలాసపురం, బారువ, బెంకిలి, బేసిరామచంద్రాపురం, కంచిలి మండలంలోని గొల్లకంచిలి. బూరగాం, శాసనాం,కవిటి మండలంలోని మాణిక్యపురం తదితర గ్రామాల్లో అటవీ పందులు పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పలువురు రైతులు గ్రీవెన్స్‌లో పంటలను రక్షించాలని కొద్దిరోజులుగా వినతిపత్రాలు అందజేస్తున్నారు. నాలుగు మండలాల్లో ఏటా అడవి పందుల వల్ల 15 నుంచి 20 శాతం వరకు పంట నష్టం జరుగుతోందని రైతులు చెబుతున్నారు.

అటవీ పందులు స్వైరవిహారం..

ఉద్దానంలోని రైతులను అటవీ పందులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి పంట చేతికివచ్చిన సమయంలో గుంపులుగా పందులు పొలాలపై పడి స్వైరవిహారం చేస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తుండడతంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పంటను రక్షించుకోవడానికి పొలాల చుట్టూ పరదాలు కట్టి, సీసాలు ఏర్పాటుచేస్తున్నారు. రైతులు రాత్రి వేళల్లో కాపలా ఉంటున్నారు.అడవి పందుల వల్ల వరి రైతులకు జరుగుతున్న నష్టాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అటవీశాఖ బారువ బీట్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు.



పలాసపురంలో వరిపంటను నాశనం చేసిన అడవి పందులు

కూటమి ప్రభుత్వంతోనే చేనేత అభివృద్ధి: కూన

పొందూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ తెలిపారు. మంగళవారం పొందూరులో చేనేత కార్మికులకు పరికరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేనేత సహకార సంఘాలు పడకేశాయని విమర్శించారు. చేనేత కార్మికులకు టీడీపీప్రభుత్వం 50 ఏళ్లకే పింఛన్ ప్రవేశపెట్టిందని తెలిపారు.చేనేతసహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. క్లస్టర్లతో చేనేత కార్మికులకు అవసరమైన పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పొందూరులో రూ. రెండు కోట్లతో నిర్వహిస్తున్న కస్టర్ల ద్వారా 90 శాతం సబ్సిడీతో చేనేత కార్మికులు పరికరాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, ఎ.రాము, ఎస్. శ్రీరంగనాయకులు, ఎ.చినరంగ, బి.గిరి, సర్పంచ్ కాలెపు శ్రీను, ఎ. పాపారావు, ఆర్.లక్ష్మి, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, పి. రామారావు పాల్గొన్నారు.



చేనేత పరికరాలు పంపిణీ చేస్తున్న రవికుమార్

నేడు క్యాన్సర్ పరీక్షలు

ఇచ్ఛాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో బుధవారం రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లట ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ మెగా క్యాంప్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం

గార, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం ఈనెల 13న కార్తీక శుద్ధ ద్వాదశి పురస్కరించుకుని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో. జి.గురునాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆ రోజు మధ్యాహ్నం శ్వేత పుష్క రిణిలో స్వామి వారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు తెప్పోత్సవం తిలకించి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

పార్టీ కోసం కష్టపడితే మంచి భవిష్యత్: ఎంపీ కలిశెట్టి



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం నారువా పంచాయతీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. బోయి గోవిందరావు, బి.వెంకటసూరి,దుర్గారావు, బోయి రాము, బోయి బంగారిరాజు, ఆళ్ల లక్ష్మణలకు అప్పలనాయుడు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో కలిశెట్టి సూర్యనారాయణ, నిద్రబంగి రామకృష్ణ, బోయి వెంకయ్య పాల్గొన్నారు.

● మండలంలోని చిల్లపేటరాజం గ్రామానికి చెందిన విద్యార్థి కె.శ్యామలరావు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు భరోసాఇచ్చారు. శ్యామలరావు ఇటీవల విజయనగరంలోని ఓ బాలురు వసతిగృహంలో అస్వస్థతకు గురై మృతిచెందడంతో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు కుటుంబ సభ్యలను మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలోకూటమి నాయకులు పిషిని జగన్నాథంనాయుడు, చిల్లా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియపై రెండు రోజుల జిల్లాస్థాయి టీవోటీల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. 21 మండలాల్లోని ఎంపీడీవోలు, పంచాయతీ విస్తరణాధికారులు, ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తారు కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీపీవో కె.భారతి సౌజన్య, జడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ కె.నిశ్చల, ఎస్.లోకనాథరావు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

గుజరాతీపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఎఫ్ విభాగంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.ఈ మేరకు మంగళవారం జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనీల్‌కుమార్, ఉపాధ్యక్షులు పి.అప్పల నాయుడు, జి.భీమారావు, బి.ఢిల్లేశ్వరరావు, కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్.చానిక్య, వి.నవీన్‌కుమార్, డి.రామ్మోహనరావు, పి.తిరుమలరావు, ఎన్.నీలామోహన్‌రావు, శ్రీరామ్మూర్తి, ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీని ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం: సీఐ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో కనీస చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే అధికంగా విక్రయించి, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీకాకుళం సర్కిల్ సీఐ ఎంపీ గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ ఏ మద్యం దుకాణానికి కేటాయించిన మద్యం ఆ షాపులోనే విక్రయించాలని, అలాకాకుండా వేరే షాపులో విక్రయించేందుకు తరలించిన వారితోపాటు షాపు యజమానిపై కూడా కేసులు నమోదుచేస్తామని తెలిపారు. గతనెల 29 నుంచి ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో డి.మత్స్యలేశం, కరజాడ, ఎస్.ఎస్.ఆర్.పురం, కె.సైరిగాం, కనుగులవానిపేట, జొన్నలపాడు, కుప్పిలి, శ్రీకూర్మంల్లో బెల్ట్‌షాపులపై దాడులుచేసి 11కేసులు నమోదుచేసి 11మందిని అరెస్ట్‌చేయడంతోపాటు 154 మద్యం సీసాలతోపాటు 50 నిబ్బులు, ఐదు బీర్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనం తరం శ్రీకాకుళంలో గల మద్యం దుకాణాల వద్ద ధరల పట్టికతోపాటు ఫిర్యాదు చేసే నెంబర్ల సూచిక బోర్డుల ఏర్పాట్లను సీఐ గోపాలకృష్ణ పరిశీలించారు.

●ఇచ్ఛాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):మద్యం దుకాణాల నిర్వాహకులు ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తే మొదటి తప్పు కింద రూ.ఐదు లక్షల అపరాధ రుసుము విధిస్తామని,రెండోసారి తప్పు జరిగితే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.

భూములను రీ సర్వే చేయాలి

ఎచ్చెర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలసలో భూముల రీసర్వే నిర్వహించాలని రైతులు కోరారు. మంగళవారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ త్రినాధరావు, సర్వేయర్ లోకేష్, సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, అల్లినగరం మాజీ సర్పంచ్ మురళీధర్‌బాబా, కూటమి నేతలు గట్టెం శివరామ్, పుణ్యపు శంకర్, రమేష్ పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

కంచిలి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):పలాసలో ఈనెల తొమ్మిది, పది తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా 18వ మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు పిలుపునిచ్చారు. మంగళవారం కంచిలిలో జరిగినసమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం సోంపేట మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ,నాయకులు గోపినాథ్, రఘు, కృష్ణశేషమ్మ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీలోని 12వ వార్డులో పర్యటించి శానిటేషన్ మంచినీటి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. 16వ వార్డులోని డాబాల వారివీధిలో మంచినీటి విభాగం సిబ్బంది మెట్ట తేజ సేకరించిన శ్యాంపిల్ పరిశీలించారు.

కంచిలిలో గణిత దశావధానం


కంచిలి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కంచిలి బీసీ బాలురు వసతి గృహం ఆవరణలో మంగళవారం వార్డెన్ జి.రామారావు ఆధ్వర్యంలో గణిత దశావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత అవధాని మద్దు తిరుపతి రావు గణితంలో వివిధ అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పారు.




























ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్

ఆలయానికి వెళ్లి వస్తుండగా..

● రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని సింగుపురం జాతీయ రహదారిపై ఆలయంలో పూజల అనంతరం ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి దుర్మరణం పాలవగా, కుమారుడు గాయపడ్డాడు. రూరల్ పోలీ సుల కథనం మేరకు.. పోలాకి మండల రాజారాంపురం గ్రామానికి చెందిన తల్లికొడుకులు ఫైలపల్లి గురుదేవి, అజిత్ మంగళవారం నాగుల చవితిని పురస్కరించుకుని సింగు పురంలోని హటకేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో బోల్తాపడింది. దీంతో డివైడర్‌కు గురుదేవి (48) ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన అజిత్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి చేర్పించారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎస్‌ఐ కె.రాము కేసు నమోదు చేశారు.

జీడిచెట్టుకు ఉరేసుకుని..


ఆనందరావు (ఫైల్)

కంచిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడుపూడికి చెందిన కదంబాల ఆనందరావు(53) పెద్దకొజ్జిరియా సమీపంలోని జీడితోటలో కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంచిలి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి.. ఆనందరావు కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడు తున్నాడు. ఈనేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పెద్దకొజ్జిరియా సమీపంలో జీడిచెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ఒడిశా నుంచి తరలిస్తుండగా మద్యం పట్టివేత

ఇచ్ఛాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేసిన సమయంలో మద్యం సీసాలు తరలిస్తున్న సన్యాసిపుట్టుగకు చెందిన బాగా నాగరాజు పట్టుబడినట్లు చెప్పారు. ఈదుపురం వద్ద ద్విచక్ర వాహనంపై ఒడిశా బీరు సీసాలను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన నౌపడ కామ రాజును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

తోటలో పేకాట.. 9 మంది అరెస్టు

రణస్థలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతర్లపల్లి పంచాయతీ పరిధిలోని సూరంపేట సమీపంలోని ఓతోటలో మంగళవారం తొమ్మిది మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టుచేశారు. జేఆర్‌పురం పోలీసుల కథనం మేరకు.. సూరంపేట తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ మేరకు తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.97,830 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహ నాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

హరిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బాలిగాం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భువనేశ్వర్‌కు చెందిన వారు భువనేశ్వర్ నుంచి విశాఖ వెళుతుండగా బాలిగాం వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కారు పంట కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే స్థాని కుల సహకారంతో పోలీసులు కారును క్రేన్ సహాయంతో రోడ్డుపైకి తీసి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించారు. చిన్న గాయాలతో ప్రయాణి కులు బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

టెక్కలి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టెక్కలి-మెళియాపుట్టి రోడ్డులోని హైవే ఫ్లైఓవర్ వంతెన వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కోటబొమ్మాళి మండలం ఊడికిల పాడు గ్రామానికి చెందిన టి.రామారావు, యు.సాంబమూర్తి ద్విచక్రవాహనంపై నందిగాం వెళ్తున్న సమయంలోటెక్కలికి చెందిన యువకులు ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన రామారావు, సాంబమూర్తిలను టెక్కలి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్తానని చెప్పి అదృశ్యం


సింహాచలం

జలుమూరు (సారవకోట) నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తొగిరి గ్రామానికి చెందిన నడగాన సింహాచలం (70) కనిపించడం లేదని అతని కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఈనెల 2న ఉదయం నరసన్నపేట ఆసుపత్రికి వెళతానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన సింహాచలం తిరిగి ఇంటికి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణంపై వాగ్వాదం

● పోలీసుల రంగ ప్రవేశం


ఎస్‌ఐ నిహార్ సమక్షంలో రోడ్డు నిర్మాణానికి కొలతలు వేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతాపురంలో రోడ్డు నిర్మాణానికి కొలతలు వేస్తున్న సమయంలో మంగళవారం గ్రామస్థుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఎస్‌ఐ నిహార్ సిబ్బందితో కలిసి వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. వివరా లిలా ఉన్నాయి.. సీతాపురంలో రోడ్డు వివాదం చాలా ఏళ్లుగా ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా సదరు వివాద స్థలంలో రోడ్డు నిర్మాణానికి ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 'పల్లెపండగ'లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులతో పాటు గ్రామస్థుల సమక్షంలో సంబంధిత అధికారులు కొలతలు తీసేందుకు వచ్చారు. అయితే సదరు స్థలం తమదంటూ కొన్ని కుటుంబాల వారు రావడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నిహార్ వచ్చి ఇరు వర్గాలతో చర్చించారు. సదరు వ్యక్తులకు సంబంధించిన స్థలాన్ని విడిచిపెట్టి మిగిలిన స్థలంలో రోడ్డు నిర్మించాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న రోడ్డు నిర్మాణానికి చర్యలుతీసుకోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎక్కడ మీదపడి కరుస్తాయో?


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కుక్కలు

టెక్కలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఎవరిపై దాడి చేసి గాయపరుస్తాయోనని ప్రజలతో పాటు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

చి'వరి' కష్టాలు..!

● సాగునీటి కోసం రైతుల అవస్థలు


కొత్తూరు మండలం వసప గ్రామంలో ఇలా..

పలాసరూరల్/నందిగాం/కొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగు చేస్తే పంట చేతికి అందివచ్చే సమయంలో నీరు లేక రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గడచిన 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో చివరిదశలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో సాగునీరు పెట్టేందుకు రైతులు మోటార్లపై ఆధారపడాల్సి వస్తోంది. మోటార్లతో దూర ప్రాంతం నుంచి నీటిని తీసుకువచ్చేందుకు అదనపు వ్యయం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటు పంటను వదుకో లేక.. మోటార్లను అద్దెకు తీసుకువచ్చి నీటిని అందిస్తున్నామని, అయితే పంట చేతికి అంది వచ్చే వరకు ఏమీ చెప్పలేమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితి పలాస మండలం రెంటికోట కాలనీ, కొత్తూరు మండలం వసప గ్రామం, నందిగాం మండలం పాలవలస, పాలూరు, మణిగాం, నందిగాం ఎగువ ప్రాంతాల్లో ఏర్పడిందని వారు వాపోతున్నారు.



పలాస రూరల్: మెట్టు ప్రాంతంలో, నందిగాం: పాలూరు వద్ద పిల్లకాలువలో ఇంజన్లు ఏర్పాటుచేసి నీటిని మళ్లిస్తున్న దృశ్యం

ఓటరు నమోదులో సమస్యను పరిష్కరించాలి

మందస, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయుల ఓటరు నమోదులో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ హైమవతిని కలిసి వినతిపత్రం అందించారు. ఓటరు నమోదు ఉన్నత పాఠశాల స్థాయిలో వివిధ మేనేజ్‌మెంట్ల ఉపాధ్యాయులు ప్రస్తుతం డీడీవోల నుంచి సర్వీసు సర్టిఫికేట్లు అందజేస్తున్నారని, గత ఆరేళ్ల నుంచి 3 ఏళ్ల సర్వీసు ఎక్కడ ఉంటే అక్కడ నుంచే సర్టిఫికేట్లు జతపర్చాలంటున్నారని, పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందించినవారిలో జి.భీమారావు, కర్ర సుంద రరావు, ఎస్.కరుణాకర్, తిరుపతిరావు ఉన్నారు.

ఎంఆర్‌పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తే చర్యలు

పలాస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో ఎంఆర్‌పీల కన్నా ఎక్కువకు మద్యం విక్రయించినా, బెల్టు దుకాణాలను నిర్వహించినా చర్యలు తీసుకుంటామని పలాస ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు హెచ్చరించారు. ఈ మేరకు మద్యం దుకాణాల వద్ద హెచ్చరిక బోర్డులను, అధికారుల ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాస-కాశీబుగ్గ, పలాస మండలం, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద అధికారుల ఫోను నెంబర్లతో సహా అందుబాటులో పెట్టామన్నారు. బెల్టు షాపులు, సారా విక్రయాలు జరిగితే సమాచారం అందించాలని కోరారు.

'అపార్' వేగవంతం చేయాలి

నరసన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వివరాలు నమోదు అపార్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు అన్నారు. మంగళవారం పలు ప్రైవేటు పాఠశాలల్లో అపార్ నమోదును పరిశీలించారు. అపార్ ఐడీ క్రియే ట్ కాకుంటే ఆధార్ కేంద్రాల్లో సరిచూడాలన్నారు. విద్యార్థుల వివరాలు తప్పుగా ఉంటే ఆధార్‌లో సరిచేసేందుకు ప్రభుత్వం పలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రబీలో వేరుశనగ పంట మేలు

కోటబొమ్మాళి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రబీ కాలంలో వేరుశనగ పంట వేసు కోడం ఎంతో మేలని వ్యవసాయాధికారి ఎస్.గోవింద రావు అన్నారు. సౌడాం గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంపీఈవో కె.భవాని, ఎంపీటీసీ పట్ట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు గుర్తులేవా?

● మాజీ మంత్రి అప్పలరాజును ప్రశ్నించిన టీడీపీ నేతలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పలాస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అరాచకాలు గుర్తులేవా అని టీడీపీ నేతలు మాజీ మంత్రి అప్పలరాజును ప్రశ్నించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏపీ టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం అప్పలరాజు పరిస్థితి చూస్తే పిచ్చెక్కిన కోతి మాదిరిగా అందరినీ కరవాలని చూస్తు న్నారనిపిస్తోందని విమర్శించారు. వైసీపీ హయాంలో లక్కోజు వినోద్ అనే యువకుడిపై సాక్షాత్తు పోలీసుల సమక్షంలోనే చితక్కొట్టి ఆయనపైనే మద్యం కేసు పెట్టి జైలుకు పంపిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు గురిటి సూర్యనారాయణ, నాగరాజు ఇళ్లపై ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్లి విరగొట్టే ప్రయత్నం చేశారని, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావుపై దాడి చేసి ఆయన కాళ్లు విరగొట్టి ఆరు నెలల పాటు రోడ్డుపైకి రానీయకుండా చేసిన ఘనత మరిచి పోయినట్లున్నారని గుర్తుచేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, డొక్కరి శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయించాలి

● మండల ప్రత్యేకాధికారి డా.కరుణాకరరావు


మాట్లాడుతున్న డా.మంచు కరుణాకరరావు

పాతపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతివారం పనుల్లో పురోగతిపై నివేదిక అందించాలన్నారు. ఇసుక ధర తగ్గినందున ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. రూఫ్ లెవెల్‌లో ఉన్నవి డిసెంబరు నెలాఖరులోగా మిగిలినవి మార్చి 2025 నాటికి శతశాతం నిర్మాణాలు చేయాల్సి ఉందన్నారు. ఎటువంటి సమస్యలనున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, హౌసింగ్ ఏఈ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం.. ఆకాశదీపం

టెక్కలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శివ, విష్ణు ఆలయ ప్రాం గణాల్లో ఆకాశ దీపాలను వెలిగించడం ద్వారా కార్తీక దామోదరుని ఆశీస్సులు లభిస్తా యని భక్తుల విశ్వాసం.. శివుడ్ని జ్యోతి రూపంలో చూసుకొని దర్శనం చేసుకోవచ్చని కొందరంటే.. మనం చేసే వివిధ కర్మలను దగ్ధం చేయగల శక్తి ఆ పరమేశ్వరునికే ఉందని మరికొందరు భావిస్తుం టారు. అందుకే కార్తీక దీపాలను ఆలయాల్లో వెలిగిస్తుంటారు. పితృ దేవతలు ఈ నిషా రాత్రుల్లో దారి కోసం సంచరిస్తుంటారని, వారికి వెలుగు చూపేం దుకు ఈ ఆకాశ దీపాలు దోహదం చేస్తాయని మరి కొందరు చెబుతున్నారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగించలేని క్రిములు, కీటకాలు, జంతువులు, పురుగులు ఈ దీపపు కాంతి వాటి శరీరంపై పడడంతో అవి కూడా జన్మరాహిత్యం చెందుతాయని కూడా పురాణాల్లో ఉన్నట్లు పండితులు పేర్కొంటున్నారు.


లింగాలవలస శివాలయంలో ఏర్పాటు చేసిన ఆకాశ దీపాలు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

లావేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల రీ సర్వే డీటీ తిరుపతిరావు కోరారు. మంగళవారం రావివలస, శిర్లపాలెంలలో రీ సర్వే గ్రామ సభలు నిర్వహించారు. గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల రికార్డులకు సంబంధించి ఎటువంటి తప్పులున్నా దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, సర్వేయర్ వినోద్, కార్యదర్శి విజయకుమారి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

సకాలంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం

● కె.వసుంధరాదేవి, సీడీపీవో



మందస, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో అంగన్ వాడీ కేంద్రాలకు ప్రభు త్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో కె.వసుంధరాదేవి తెలిపారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి?

జవాబు: 120 మెయిన్, 49 మినీ కేంద్రాలు ఉన్నాయి.

ప్ర: కేంద్రాల్లో ఎంతమంది సేవలు పొందుతున్నారు?

జ: 3872 మంది పిల్లలు, 392 మంది గర్భిణులు, 466మంది బాలింతలకు పౌష్టికాహారం, బాలామృతం అందించడం జరుగుతోంది.

ప్ర: అన్ని కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయా?

జ: అన్నింటికీ లేవు. 53 పక్కా భవనాలు, 40 అద్దె భవనాలు, 76 అద్దె లేని భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

వేతనాలు అందించాలి

కొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే అందించాలని కొత్తూరు, కరిగాం పీహెచ్‌సీ 104 సిబ్బంది కోరారు. ఈ మేరకు వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. మూడు నెలల నుంచి వేతనాలు అందలేదన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవో కు జీవో-7 ద్వారా వేతనాలివ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో 104 ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్ తదితరులున్నారు.

మూడునెలలుగా వేతనాల్లేవు

పోలాకి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాల్లేక అవస్థలు పడుతున్నామని 104 వాహన సిబ్బంది ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళ వారం గుప్పెడుపేట, పోలాకి పీహెచ్‌సీ వైద్యాధికారులు రతన్‌రాజు, శ్రీనాథ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. తగు చర్యలు తీసుకుని ఆదుకోవాలని 104 వాహన సిబ్బంది మహేష్, సూర్య, నరేష్, సుమతి కోరారు.

భగత్‌సింగ్ ట్రస్ట్ సాయం

కొత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆపదలో ఉన్న రెండు కుటుంబాలకు భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు సాయమందించారు. రాయల గ్రామానికి చెందిన పెద్దింటి లక్ష్మి భర్త ఏడేళ్ల క్రితం చనిపోయారు. ఆమె కేన్సర్‌తో బాధప డుతుండగా మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. అలాగే కొత్తూరు మహర్తాపురం గ్రామానికి చెందిన పొన్నాడ వెంకటరావు కార్పెంటర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తుండగా ఇటీవల పక్షవాతం వచ్చి ఇంటికే పరిమిత మ య్యాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని రూ. 15వేల నగదు అందించారు.

రాయితీపై ఇచ్చే విత్తనాలు సిద్ధం

హిరమండలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కి సంబంధించి రాయితీపై అందించేందుకు విత్తనాలు వచ్చాయని ఏవో సంధ్య తెలిపారు. మినుములు పియూ31 రకం 20 క్వింటాళ్లు, పెసలు విరాట్ రకం 3 క్వింటాళ్లు వచ్చినట్లు చెప్పారు. వేరుశనగ, కట్టె జనుము విత్త నాలు నాలుగు రోజుల్లో వస్తాయన్నారు. రైతులు వీటిని వినియోగించుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి

నాగుల చవితి వేడుకలు మంగళవారం అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పవిత్రస్నానాలు ఆచరించి కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి, గుడ్లు, చిమ్మిలి వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అనారోగ్యం కలుగకుండా చూడాలని నాగేంద్రుని కోరుకున్నారు. కొన్ని గ్రామాల్లో పగటి వేషధారణలు ఆకట్టుకున్నాయి. చిన్నపిల్లలు బాణసంచా కాల్చి ఆనందం పొందారు.

-ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: రామలింగేశ్వరాలయం పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

బూరవెల్లిలో రేపు..

గార, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరవెల్లి గ్రామస్థులు కార్తీక శుద్ధ షష్టి నాడు గురువారం నాగుల చవితిని నిర్వహిస్తారు. హిందువులంతా కార్తీక శుద్ధ చవితి నాడు నాగుల చవితి జరుపుకొంటారు. అయితే మా గ్రామంలో పూర్వీకుల నుంచి షష్టినాడు నాగుల చవితి చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందని బూరవెల్లి గ్రామస్థులు, గ్రామ పురోహితులు ఆరవెల్లి సీతా రామస్వామి చెబుతున్నారు.


జలుమూరు: శ్రీముఖలింగంలో నాగేంద్రునికి పూజలు


సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో..


పోలాకి: మబుగాంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే రమణమూర్తి


జి.సిగడాం: పెంట గ్రామంలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు



కొత్తూరు: సిరుసువాడ, నందిగాం: పెంటూరులో కళాకారుల పగటి వేషాలు